
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 4 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు: ఇఫ్తార్ (మంగళ) సా.6.18 | సహరి (బుధ) ఉ.4.58

బుకీలు బుక్కయ్యారు!

పేలిన ఉల్లిబాంబులు

కాకినాడలో ఘటన

7

అధ్యక్షా!

అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేలు గళమెత్తారు.. సమస్యల వాణి వినిపించారు.. అభివృద్ధికి అండగా నిలబడాలని కోరారు.. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా ముగ్గురు ఎమ్మెల్యేలు తమ విన్నపాలు అసెంబ్లీలో ఎలుగెత్తారు.. రాజమహేంద్రవరం, కొవ్వూరు ఎమ్మెల్యేలు గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై విన్నవించారు.. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. అనపర్తి ఎమ్మెల్యే డెల్టా ఆధునికీకరణ, కాటన్ బ్యారేజీ అభివృద్ధిపై చర్చించారు.. వెంటనే ఆధునికీకరణ పనులపై దృష్టి సారించాలని కోరారు.

పుష్కరాలకు 15 కోట్ల మంది భక్తులు : వాసు



రాజమహేంద్రవరం సిటీ,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన మహాకుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ స మావేశాల్లో సోమవారం డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు మాట్లాడే అవకాశం ఇవ్వడంతో ఆదిరెడ్డి వాసు గోదావరి పుష్కరాల గురించి మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు ఇంకా రెండేళ్ళ సమయం ఉందన్నారు.రాజమహేంద్రవరం, రూరల్, కొవ్వూ రు,రాజానగరం ఇంకా గోదావరి పరీవాహక ప్రాంత పరిధిలో 12 రోజుల పాటు జరిగే పుష్కరాలకు దేశవ్యాప్తంగా 15 కోట్ల మంది యాత్రి కులు ,భక్త లు, వస్తారని అంచనా ఉందన్నారు.దానికి తగినట్టు ఇప్పటి నుంచే పనులు చేయాలన్నారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించాలన్నారు.

కొవ్వూరులో 25 కి.మీ గోదారి తీరం : ముప్పిడి



కొవ్వూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గోదావరికి 2027లో రానున్న పుష్కరాలకు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కొత్తగా ఘాట్లను అభివృద్ధి చేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కొవ్వూరు నియోజకవర్గం విజ్జేశ్వరం సెంటర్ నుంచి పట్టి సీమ వరకు సుమారు 25 కిలోమీటర్లు గోదావరి తీరాన్ని ఆనుకుని ఉందన్నారు. పుష్కర యాత్రికులను దృష్టిలో పెట్టు కుని ఘాట్లు, దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కొవ్వూరులో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని కోరారు. పశివేదల, దొమ్మే రు, నందమూరు, వేములూరు గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు,ఈనామ్ 22ఏ సమస్యలను పరిష్కరించమని రెవెన్యూ మంత్రి అన గాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టాలి : నల్లమిల్లి



అనపర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాటన్ బ్యారేజీ ప రిరక్షణకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. అసెంబ్లీలో గోదావరి డెల్టా ఆధునీకరణ ఆవశ్యకతను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు.గోదావరి డెల్టాలో 4216 కిలోమీటర్ల కాలువలు, 3616 కిలో మీటర్ల డ్రెయిన్లు ఉన్నాయని వీటిలో ఒక్క కిలో మీటరు కూడా తూడు తీసిన దాఖలాలు గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో లేవన్నారు. బ్యారేజీ మరమ్మతుల నిమిత్తం డ్రిప్ పథకం కింద మంజూరైన రూ.146 కోట్లతో పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు.లిఫ్ట్ ఇరిగేషన్‌లోని చాగల్నాడు, వెంకటనగర్, పుష్కర ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిం దని వీటిని పునరుద్ధరించే ప్రతిపాదనలు ఉన్నాయా అని మంత్రిని కోరారు.

బ్యాలెట్.. బాక్సింగ్!



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఓట్ల లెక్కింపు

ఉదయం నుంచి ఎమ్మెల్సీ ఓట్లతో కుస్తీ

- సుదీర్ఘంగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కట్టలుగా కట్టేందుకే 12 గంటలు
- 700 మంది సిబ్బంది నియామకం
- మూడు షిఫ్టులుగా విధులు
- రాత్రి 8 నుంచి లెక్కింపు ఆరంభం
- 10 గంటలకు తొలిరౌండ్ పూర్తి
- ఫలితానికి మరింత సమయం
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

(ఏలూరు - ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది. ఫిబ్రవరి 27న జరిగిన పోలింగ్‌లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి 17 రౌండ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ సోమవారం ఉదయం ఆరంభమై రాత్రి పొద్దు పోయేంత వరకు నిరవధికంగా కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. సాధ్యమైనంత మేర కౌంటింగ్ ప్రక్రియలో జాప్యం నివారించేందుకు ప్రయత్నిస్తున్నా పొద్దు పోయేంత వరకు బ్యాలెట్ పత్రాలు బండిల్స్‌గా కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. 17 రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో 17 రౌండ్ల మేర కొనసాగించేందుకు ఏర్పాట్లుచేసి మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు.

లెక్కింపు.. ఈజీ కాదు..

సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండా పోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లుగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.



లెక్కింపు కేంద్రం వద్ద కూటమి అభ్యర్థి పేరాబత్తుల

బండిల్స్‌గా కట్టేందుకే ఒకరోజు..

సాధారణ ఎన్నికలకు భిన్నంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగించారు. ఈకారణంగా బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రంలోకి రప్పించడం, వాటి నుంచి బ్యాలెట్ పత్రాలను వెలికి తీసి బండిళ్లుగా కట్టడానికి చాలా సమయం తీసుకుంది. రౌండ్‌ల వారీగా పదివేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి అతి తక్కువ టేబుళ్లను వేసి కౌంటింగ్‌కు దిగారు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లుగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురు చూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో తొలి ప్రక్రియ మాత్రమే రాత్రి వరకు కొనసాగుతూ వచ్చింది. రాత్రి ఎనిమిది గంటల సమయానికి బండిళ్లుగా కట్టడం పూర్తయ్యింది. ఈ మొత్తం ప్రక్రియకు మొత్తం 12 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ఆరంభించారు. ప్రచారంలో నువ్వానేనా అన్నట్టుగా సాగిన వ్యవహారం ఓట్ల లెక్కింపు లోను అదే ఉత్కంఠ కొనసాగుతోంది.

తొలి రౌండ్ పేరాబత్తులదే..

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతుంది. ఎనిమిది రౌండ్‌లుగా ఒక్కో రౌండ్‌కి 28 వేలు చొప్పున లెక్కించేందుకు రంగంలోకి దిగారు. ఒక్కో రౌండ్‌లోను చెల్లినవి, చెల్లని ఓట్లు విడివిడిగా విభజిస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 16,520 ఓట్లు, సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుకు 5,815 వేల ఓట్లు, ఇతరులకు 3249 లభించాయి. 2416 చెల్లని ఓట్లు ఉన్నాయి.ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి మంగళవారం రాత్రి పొద్దుపోవచ్చని అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఏలూరు క్రైం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువ జామునే కౌంటింగ్ విధులకు నియమిం చబడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేశారు.సెల్‌ఫోన్‌లు బయట కౌం టర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్.కిశోర్



అధికారుల పరిశీలన

గోదావరిలో ఘోర ప్రమాదం



పుష్కరఘాట్‌లో మృతుడి కుటుంబీకులు

గోదావరిలో ఘోర ప్రమాదం జరిగింది.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ నుంచి గోదావరి లంకల్లోకి 23 మందితో బయలు దేరిన నాటు పడవ పాత రైలు వంతెన 8వ పిల్లర్ వద్ద సోమవారం రాత్రి 7:30 గంటలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు గల్లంతయ్యారు.. మిగిలిన వారు స్తంభాలను పట్టుకుని ఉండడంతో కాపాడారు. గాలింపు చర్యలు చేపడుతున్నారు. - మెయిన్‌లో

ప్రభుత్వ బోధనాసుపత్రిలో
విధులపై రచ్చ రచ్చ

- ఒక్క ఎంఎన్‌వోకు ఎనిమిది వార్డుల్లో విధులా ..?
- మరో ఎంఎన్‌వోతో మందుల పెట్టెలు మోయిస్తారా ?
- ఆర్ఎంవో ఎదుటే ఎంఎన్‌వోలు, జీడీఏలు పంచాయితీ
- ఆర్ఎంవోకు అసోసియేషన్ నాయకుల ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఎంఎన్‌వోలు, జీడీఏలకు డ్యూటీల వ్యవహారం రచ్చ రచ్చగా మారింది. డ్యూటీలు వేసే సూపర్‌వైజర్ అస్మదీయులకు ఒకలా, తస్మదీయులకు మరోలా డ్యూటీలు వేస్తుండడంతో ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఆసుపత్రి ఆర్ఎంవో ప్రణవ్‌కు ఫిర్యాదు చేసేంత వరకూ వెళ్లింది. కనీస అవగాహన లేకుండా ఒక ఎంఎన్‌వోకు 8 వార్డుల్లో డ్యూటీ వేయడం, మరో ఎంఎన్‌వోతో మందుల పెట్టెలు మోయించడం తదితర సమస్యలపై కొందరు ఎంఎన్‌వోలు భగ్గుమని మండిపడుతూ జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులకు ఫిర్యాదు చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం దీనిపై ఆర్ఎంవో గదిలో ఆయన ఎదుటే ఎంఎన్‌వోలు, జీడీఏలు, అసోసియేషన్ నాయకులతో పెద్ద పంచాయతీ నడిచింది. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్న సీనియర్ ఎంఎన్‌వో రోస్టర్‌ను పాటించకుండా స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా డ్యూటీలు వేస్తున్నారని, దీనివల్ల చాలా మంది ఎంఎన్‌వోలు డ్యూటీలు చేయలేక నలిగిపోతున్నారని పేర్కొన్నారు. డ్రగ్ స్టోర్‌లో పనిచేస్తున్న పలువురు ఎంఎన్‌వోలు, జీడీఏలను మందుల పెట్టెలు మోసేందుకు వినియోగించడం సరికాదని, ఒక హెచ్‌వోడీ దగ్గర ఇద్దరు జీడీఏలు ఎంఎన్‌వోలుగా సుమారు రెండేళ్ల నుంచి కొనసాగుతున్నారన్నారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన పీఆర్‌వోలు ఆసుపత్రిలోకి అనధికారికంగా ప్రవేశించి కేసులు తరలించుకుపోతున్నారని వెల్లడించారు. డ్యూటీలు వేసే సూపర్‌వైజర్‌పై గతంలో అనేక ఆరోపణలు రావడంతో అధికారులు కొద్ది రోజులు పక్కకు తప్పించి మళ్లీ ఆయన్నే సూపర్‌వైజర్ చేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎన్‌వోలు, జీడీఏల డ్యూటీల రోస్టర్ అవకతవకలపైనా,అనధికార వ్యక్తుల ప్రవేశంపైనా ఆసుపత్రి ఉన్నతాధికారులు విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవోను కోరామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. దీనిపై ఏం చర్యలు చేపడతారో చూడాల్సిందే.

సీనియర్ ఇంటర్ పరీక్షలకు 283 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2025లో భాగంగా సోమవారం నుంచి రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు ఆరంభమయ్యాయి.మొదటి రోజున జనరల్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం నిర్వహించగా 18,005 మందికి 17,777.. ఒకేషనల్ విభాగంలో 1689కి 1634 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

కేశవరం, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో
ఆర్‌వోబీల నిర్మాణం
కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనపర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డులో మండపేట మండలం కేశవరం, అనపర్తి మండల లక్ష్మీనరసాపురం గ్రామాల వద్ద రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కేశవరం,లక్ష్మీనరసాపురం గ్రామాల వద్ద ప్రజలు ఇబ్బందులకు ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ నిర్వహించడంతో బాటు పనులు చేపడతామన్నారు.

ఆదాయం ఆనందం



జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయ్

- పెరిగిన ధరలు..
- జీవన వ్యయంపై ప్రభావం
- పెరిగిన మహిళా అక్షరాస్యత
- సగటు జనసాంద్రత 304
- ప్రాజెక్టుల పురోగతిపై లెక్కలు
- సోషియో ఎకనామిక్ సర్వే
- ఇదీ తూర్పు లెక్క

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం సోమవారం సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో 465 పేజీల నివేదిక వెల్లడించింది. ఇందులో రాష్ట్రం ఏయే రంగాల్లో ప్రగతి దిశగా కదులుతోంది.. ఆయా రంగాల్లో ప్రగతి ఎలా ఉంది.. జిల్లాల వారీగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక, ప్రజల ఆర్థిక స్థితిగతులు వంటి అనేక కీలక అంశాలకు సంబంధించి నివేదిక విడుదల చేసింది. ఇందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాల వారీగా ఆయా సామాజిక, ఆర్థిక స్థితిగతులను గణాంకాల రూపంలో విశ్లేషించింది.తూర్పుగోదావరి జిల్లాలో జీవన ప్రమాణాలు పెరుగుతున్నట్టు స్పష్టం చేసింది.

పెరిగిన తలసరి ఆదాయం..

దేశంలో రాష్ట్రం 8వ పెద్ద రాష్ట్రంగా ఏపీ ఉండగా..చదరపు కిలో మీటరుకు జనసాంద్రత సగటున 304గా ఉంది.తూర్పుగోదావరి జిల్లాలో కూడా జనసాంద్ర ఎక్కువే. ఈ సర్వేలో 1981 నుంచి అక్షరాస్యత పెరిగినట్టు స్పష్టం చేసింది. జిల్లాలో ఆక్వా, చేపల పరిశ్రమ, సేవల రంగం పెరుగుతోంది.తలసరి ఆదాయం రూ.2,68,653 గా ఉంది.ధరల పెరుగుదల కారణంగా జీవన వ్యయంపై ప్రభావం పడుతున్నట్టు స్పష్టం చేసింది.పరిశ్రమల్లో కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ) ప్రకారం పురుషుల వేతనాల కంటే మహిళల వేతనాలు తక్కువగా ఉన్నట్టు తెలిపింది.

సాగునీటి ప్రాజెక్టులు..

జిల్లాలో పోలవరం ప్రాజెక్టు పనులు 74.92 శాతం పూర్తయ్యాయని అందులో ఎడమ ప్రధాన కాలువ పనులు 73 శాతం, కుడి ప్రధాన కాలువ పనులు 74.92 శాతం పూర్త యినట్టు స్పష్టం చేశారు.ప్రాజెక్టు 78 శాతం పూర్తయినట్టు నివేదిక ఇచ్చారు. పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రస్తావన ఉంది. ఆగ్రో క్లైమేటింగ్ జోన్ పరిధిలో గోదావరి జోన్ పేరిట తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నట్టు తెలిపింది. అతి ఎత్తయిన టింబర్ ఉండే జోన్‌గా తూర్పు నుంచి శ్రీకా కుళం వరకూ పరిగణిస్తున్నారు.

పాడి.. పంటలు..

జిల్లాలో ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ)ని అమలు చేస్తున్నట్టు తెలిపింది. ఈ ప్రాజెక్టు 2017 నుంచి అమల్లో ఉంది. ఐసీడీపీ పథకం కింద జిల్లాలో రూ.198.45 కోట్లతో 13 గొడౌన్ కమ్ ఆఫీస్ భవనాలు నిర్మించారు. సొసైటీలకు వీటిని వినియోగిస్తున్నారు. జీడి మామిడి తోటలకు ప్రాధాన్యత ఉన్న జిల్లాగా గుర్తించారు. ఇక్కడి పాత చెట్లు తీసేసి బాగా కాపు కాసే చెట్లను పెంచనున్నట్టు స్పష్టం చేసింది. సిల్క్ ఫ్యాబ్రిక్ క్లస్టర్‌గా జిల్లా ఉన్నట్టు పేర్కొంది.ఈ రంగంలో చిన్న తరహా పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నట్టు స్పష్టం చేసింది. జిల్లా ఎక్స్‌పోర్ట్ హబ్‌గా ఉందని, ఇక్కడ క్వాయర్, కాయర్ ఉత్పత్తులు, జీడి మామిడి,నర్సరీలు ఉన్నాయని తెలిపింది. వివిధ పంటలు, పాలు మాంసం ఉత్పత్తి గణాంకాలు ఇచ్చింది.పాలు 351.968 లీటర్లు, 77.319 టన్నుల మాంసం, గుడ్లు 58047.314 టన్నులు ఉత్పత్తి అయినట్టు లెక్క కట్టింది. జిల్లాలో 20 పశుగణన ప్రకారం 74,778 పాలు, మాంసం కోసం పెంచే జంతువులు ఉండగా, గేదెలు 1,93,847, గొర్రెలు 1,71,263, మేకలు 69,265, పందులు 2080, కోళ్ల 2,13,75,656 ఉన్నట్టు తేల్చింది. ఇన్ ల్యాం డ్‌ఫిష్, ఫ్రెష్ వాటర్ రొయ్యలు 93,199 ఉన్నా యి. ఇలా సర్వే తెలియజేసింది.

నిధులు..నిక్షేపాలు..

కేజీ బేసిన్‌లో సహజవాయువు అన్వేషణ్, ఉత్పత్తి గురించి ప్రస్తావించింది.జిల్లా గ్రానైట్‌కు గుర్తింపు ఉందని తెలిపింది. తూర్పు నుంచి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వరకూ రోడ్ల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేసింది. ఇక్కడ 30 రోడ్లు, 16 బ్రిడ్జిలతో మొత్తం 46 పనులు చేస్తుండగా ఇప్పటికే 27 రోడ్లు, 14 బ్రిడ్జిలు పూర్తయినట్టు స్పష్టం చేసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ అండ్ మిసిలీనియస్ పనులు జరుగుతున్నాయి.ఇప్పటికి 30 శాతం పూర్తికాగా ఆగస్టు 11వ తేదీకి మొత్తం పనులు పూర్తవుతాయని తెలిపింది. టూరిజం హబ్‌గా అభివృద్ధి జరగనుందని..జిల్లాలో బోటింగ్ ఫ్లీట్‌కు అనుకూల పరిస్థితి ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపింది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింది హేవలాక్ బ్రిడ్జిని టూరిస్టులు ఆకర్షించే విధంగా రూ.94.44 కోట్లతో అభివృద్ధి చేస్తారని సర్వే స్పష్టం చేసింది. ఇక ఆర్థిక అసమానతల విషయంలో హెడ్‌కో యూనిట్ శాతం 6.13 ఉంది. ఇంటర్‌సిటీ 43.65 శాతం, ఎంపీఐ స్కోర్ 0.027గా ఉంది. జిల్లాలో ఈ ఏడాది వర్షపాతం 12.2 శాతం అధికంగా నమోదు కావడం గమ నార్హం. జిల్లాలో దీపం, వివిధ రకాల పథకాల కింద ఎంత మంది లబ్ధిపొందుతున్నారో కూడా స్పష్టం చేసింది.



ప్రపంచ వినికిడి దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

వినికిడి సమస్యను నిర్లక్ష్యం చేయవద్దు
డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వినికిడి సమస్యలు తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. వయసు రీత్యా వినికిడి లోపం వచ్చిన వారికి ఎన్జీవో సంస్థలు, ప్రభుత్వ పథకాల్లో భాగంగా వినికిడి యంత్రాలు అవసరమైన వారికి అందేలా చూసుకోవాలని తెలిపారు. వినికిడి సమస్యతో చాలా మంది నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పుట్టుక నుంచే వినికిడి పరీక్షలు నిర్వహించి ఏమైనా సమస్యలుంటే సత్వర చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు జిల్లా ఎపిడిమాలజిస్ట్ సుధీర్‌బాబు, డిప్యూటీ డెమో సత్యకుమార్, డాక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.




వన దేవత అమ్మవారిని సీలేరు నదిలో పడవలో నుంచి...
అనంతరం పొల్లూరు జలపాతం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



అమ్మవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా

గిరిజన జాతర

అంబరాన్నంటిన మన్యంకొండ జాతర
పొల్లూరు జలపాతం వద్దకు పోటెత్తిన ఒడిశా, ఆంధ్ర భక్తులు
బంగారు చేప దర్శనంతో తన్మయత్వం

మోతుగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు గ్రామంలో సోమవారం జరిగిన మన్యంకొండ జాతరకు ఒడిశా, ఆంధ్ర భక్తులు పోటెత్తారు. ముందుగా ఒడిశా సరిహద్దు నుంచి మన్యంకొండ దేవతను సీలేరు నదిలో ప్రత్యేక కొత్త పడవపై పొల్లూరు తీసుకొచ్చారు. అక్కడ చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా, ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు ప్లాంట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని ఆహ్వానించారు. అనంతరం పొల్లూరు మైదానంలో మిద్దెలను ఏర్పాటు చేసి అమ్మవారిని కూర్చోబెట్టారు. అక్కడ పొల్లూరు అర్చకుడు అయినవిల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో, అడిషనల్ ఎస్పీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నానావిధ పరిమళ పుష్పాలు, ధూప, దీప నైవేద్యాలతో పూజారి కుమారస్వామి శర్మ పూజలు చేశారు. అనంతరం వేలాది మంది గిరిజనులు నృత్యాలు, మేళతాళాలతో వన దేవతను పొల్లూరు జలపాతం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ ఒడిశా నుంచి వచ్చిన పూజారులు వారి విధానంలో పూజలు జరిపారు. జలపాతం నీటి దగ్గరకు వచ్చి నైవేద్యం సమర్పించగానే బంగారు చేప



బంగారు చేపకు ప్రసాదం సమర్పిస్తున్న పూజారులు

దర్శనమిచ్చింది. ఒడిశా ప్రజలంతా ఒక్కసారిగా అమ్మవారి నామస్మరణ చేస్తూ బంగారు చేపకు నమస్కరించుకున్నారు. జలపాతం వద్ద పూజారుల స్నానం అయ్యాక అమ్మవారి ఘటాలను నీటిలో ముంచి తీశారు. తర్వాత భక్తులంతా జలపాతంలో స్నానాలు చేశారు. జలపాతం వద్ద నుంచి అమ్మవారిని సీలేరు నది దాటించి ఒడిశాకు తీసుకెళ్లారు. దీంతో ఆంధ్రాలో మన్యంకొండ జాతర పూర్తయింది.

ఏర్పాట్లు భేష్...

మన్యంకొండ జాతరలో పాల్గొనేందుకు ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ సోమవారం ఫ్లోటింగ్ బ్రిడ్జి దాటి పొల్లూరు



జాతరకు వచ్చిన నవరంగపూర్ ఎంపీ బలబద్రి మజ్జి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడకామీ

చేరుకున్నారు. వారికి ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అక్కడి నుంచి నేరుగా పొల్లూరు జలపాతం వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మన్యంకొండ జాతరకు వచ్చే రెండు రాష్ట్రాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆంధ్ర అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. చింతూరు మండల అధికారులు సీలేరు నది వద్ద వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా జరిగిందన్నారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా, మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయ్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్, మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, గంగవరం ఎస్ఐ వెంకటేశ్వర రావు, చింతూరు తహసీల్దారు శ్రీనివాసరావు జాతరను పర్యవేక్షించారు. జాతరకు దాదాపు 40వేల మంది భక్తులు హాజరుకాగా వారికి భోజన ఏర్పాట్లు చేశారు. అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులు, స్థానిక యువకులు, వ్యాపారస్తులు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్ల పంపిణీ చేశారు.



మన్యంకొండ జాతరను తిలకించేందుకు వచ్చిన భక్తులు

బాలయోగి ఆశయ సాధనకు కృషి

» త్వరితగతిన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం » కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



బాలయోగి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కోనసీమ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన లోక్‌సభ దివంగత స్పీకర్ సేవలు మరువలేనివని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జీఎంసీ బాలయోగి ఘాట్‌లో సోమవారం జరిగిన బాలయోగి 23వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరితోనూ ఆప్యాయంగా ఉండే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో అకాల మృత్యువు చెందడం దురదృష్టకరమన్నారు. తొలుత మంత్రి అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి బాలయోగి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాలయోగి ఆశయాల్లో అత్యంత ప్రధానమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైళ్లను నడిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. తన తండ్రి ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. బాలయోగి ఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, మానేపల్లి అయ్యాజీ వేమా, ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, కూటమి నేతలు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆకుల రామకృష్ణ, నాగిడి నాగేశ్వరరావు, నల్లా పవన్‌కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దెందుకూరి సత్తిబాబురాజు, కేతా శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, చింతం కృష్ణ, మోకా వెంకటసుబ్బారావు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్వీ నాయుడు, మద్దింశెట్టి సూరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాలయోగి ఘాట్‌లో నివాళులర్పించారు. అంతకు ముందు బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్ తన గృహంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన టీడీపీ కోరింగ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంట పల్లి చంద్రమౌళి కుటుంబానికి బాలయోగి జ్ఞాపకార్థం రూ.లక్ష చెక్కును కేంద్ర మంత్రి, ఎంపీ అందజేశారు.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ సుజాత

మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు

కాకినాడ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ ఆవిష్కరించారు. 5న జరిగే క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభకు కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్‌లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి, సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.జయలక్ష్మి, కన్వీనర్ దేవి, కాకినాడ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరదాడి సత్తిరాజు, వై.రామకృష్ణ, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నన్నయ'లో నారీఫెస్ట్

దివాన్‌చెరువు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. తొలిరోజైన మంగళవారం మామ్మ (అమ్మమ్మ, నానమ్మ) -మనవరాలు ఫ్యాషన్‌షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. హెల్దీ బేబీ షోలో పాల్గొనేందుకు ఐదేళ్లలోపు బాలబాలికలు అర్హులన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని వీసీ కోరారు. హెల్దీ బేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లను సంప్రదించాలన్నారు. గురువారం వర్సిటీలో నన్నయ యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు, 6న అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.88 కోట్లు

అన్నవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. రూ.1,88,91,940 నగదు, 66 గ్రాముల బంగారం, 693 గ్రాముల వెండి సమకూరాయి. 129 యూఎస్ఏ డాలర్లు, 530 యూఏఈ దిరహమ్స్, సెంట్రల్ బ్యాంక్ 100 ఒమెన్, 50 సింగపూర్ డాలర్లు లభించాయి. 31 రోజులకు ఈ ఆదాయం లభించిందని ఈవో సుబ్బారావు చెప్పారు.



లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై పోక్సో కేసు

కరప, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొర్రిపూడి హైస్కూల్ హెచ్‌ఎం కాశీవిశ్వేశ్వరరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాకినాడ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణలతో కలిసి స్థానిక పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థినులను రహస్యంగా విచారించి వివరాలను నమోదు చేశారు. 78మంది విద్యార్థినులను విచారించగా వారిలో 20మంది హెచ్‌ఎంకు వ్యతిరేకంగా రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. విచారణ నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు. విద్యార్థినులపై హెచ్‌ఎం లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు.

'టిస్' ఆధారంగా సీనియారిటీ జాబితా

కాకినాడ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించినట్టు పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. ఈ జాబితాలను సంబంధిత ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల వెబ్‌సైట్‌లోనూ, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10లోపు సంబంధిత ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోసమర్పించాలని సూచించారు.

మరణంలోనూ వీడని స్నేహం!

● రామవరంలో రోడ్డు ప్రమాదం ● ట్రాలీని ఢీకొని ముగ్గురు యువకుల మృతి



జగ్గంపేట మండలం రామవరంలో సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు



అబ్దుల్లా (ఫైల్)



హర్షవర్ధన్ (ఫైల్)



మణికంఠ (ఫైల్)

జగ్గంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ప్రాణ స్నేహితులైన ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అబ్దుల్లా (17), రౌతుల హర్షవర్ధన్ (17), వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుగుపూడి నుంచి ఒకే మోటారు సైకిలుపై జగ్గంపేట బయల్దేరారు. రామవరం వచ్చేసరికి ట్రాలీని దాటించబోయి దాన్ని ఢీకొన్నారు. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మణికంఠ(17) స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ పరారీలో ఉన్నట్టు స్థానిక సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ఓదార్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం, తోట రాంజీ మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

కుటుంబాల కోసం కూలీపనుల్లోకి...

ప్రమాదంలో మరణించిన రౌతుల హర్షవర్ధన్, వేణు మణికంఠ కిర్లంపూడి మండలం బూరుపూడి గ్రామానికి చెందినవారు. మరొక యువకుడు షేక్ అబ్దుల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామం అని స్థానికులు తెలిపారు. వారు ముగ్గురు ప్రాణ స్నేహితులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత ఆర్థిక పరిస్థితి రీత్యా స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాయపడుతున్నారు. షేక్ అబ్దుల్లా తండ్రి కిర్లంపూడి మండలం బూరుగుపూడి సాగు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. చేతికందివచ్చిన కొడుకులు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

ఉల్లిక్కి పడ్డారు!

» కాకినాడలో ఉల్లిబాంబుల పార్శిల్ దింపుతుండగా భారీ పేలుడు
» ఐదుగురు హమాలీలకు గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



లారీ నుంచి పార్శిల్ దించుతున్న దృశ్యం



భారీ పేలుడు సంభవించిన ప్రాంతం



పార్శిల్‌లో వచ్చిన ఉల్లి బాంబుల డబ్బాలు

కాకినాడ క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సోమవారం ఉల్లిబాంబుల భారీ పేలుడు సంభవించి ఐదుగురు హమాలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం కమర్షియల్ రోడ్డులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరం ఉన్న జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి హైదరాబాద్‌లో ఉన్న అదే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ నుంచి సోమవారం ఉదయం పార్శిల్ లారీ వచ్చింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న హమాలీలు ఒక్కో పార్శిల్‌ను కిందకు దించుతున్నారు. గజ్జల మధు అనే హమాలీ లారీ నుంచి ఒక పార్శిల్‌ను దించుతూ కిందకు పడవేశాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో అక్కడ విధుల్లో ఐదుగురు హమాలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో స్థానిక డైరీఫాం సెంటర్‌కు చెందిన 35ఏళ్ల గజ్జల మధు, అదే ప్రాంతానికి చెందిన 32ఏళ్ల మేడిశెట్టి లోవరాజు, కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ ప్రాంతానికి చెందిన 30ఏళ్ల బొందు అశోక్, ఇంద్రపాలెం గ్రామానికి చెందిన 39ఏళ్ల దారా నగేష్, అదే ప్రాంతానికి చెందిన 55ఏళ్ల బంధాల పోతురాజు ఉన్నారు. మధు పరిస్థితి విషమంగా ఉన్నట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.

ఘటన అనంతరం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్‌దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటన జరగడానికి ప్రధాన కారణం చిన్న పిల్లలు గోడకేసి కొట్టే ఉల్లిపాయ టపాసులని ఎస్పీ వెల్లడించారు. స్థానిక పెద్దమార్కెట్‌లో జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్న మాజేటి శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీలో ఒక్కో ప్లాస్టిక్ డబ్బాలో 60 ఉల్లిబాంబులు ఉండేలా ప్యాక్ చేశారు. ఒక్కో పార్శిల్‌లో 30 డబ్బాల చొప్పున 3 పార్శిల్‌లు దిగుమతి చేసుకున్నాడు. అందులో మొదటి పార్శిల్ దింపుతుండగా ఈ విస్ఫోటనం జరిగింది. దీంతో మరో పార్శిల్‌లో ఉన్న పెద్ద పెద్ద నట్లు, బోల్టులు చెల్లాచెదురుగా ఎగిరిపడి హమాలీలకు కాలిన గాయాలయ్యాయి. దీనిపై కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ కేసు నమోదు చేశారు.

బుకీలు.. బుక్కయ్యారు!

» ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించిన ఆరుగురి అరెస్ట్
» 4 ల్యాప్‌టాప్‌లు, ఎల్ఈడీ టీవీ, 2 లైన్‌బాక్స్‌లు, 2 ట్యాబ్‌లు,50ఫోన్లు స్వాధీనం
» రూ.7.38 లక్షలు నగదు కలిగిన ఖాతా ఫ్రీజ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

రాయవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన భారత్ - న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడి చేసి ఆరుగురు క్రికెట్ బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై పోలీసులు బెట్టింగ్ స్థావరంపై దాడులు నిర్వహించారు. సోమేశ్వరం వినాయక కాలనీకి చెందిన లింగాపు సతీష్‌కు చెందిన ఇంట్లో బెట్టింగ్ జరుగుతుండగా బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమేశ్వరం బుకీలు ఇచ్చిన సమాచారంపై ఇక్కడి బెట్టింగ్ స్థావరానికి అనుగుణంగా రాజానగరం మండలం చక్రధారబందం ఒక అపార్ట్‌మెంట్‌లో యమునా బ్లాక్ ప్లాట్ నెంబరు 605లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మరో నలుగురు బుకీలను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిగిన రెండు బెట్టింగ్ స్థావరాలపై దాడులు జరిపి కె.నాగేంద్ర, కేవీ రెడ్డి, ఎన్.రవి, ఎ.వినయ్, జి.గణేష్, పి.వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన లింగాపు సతీష్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. సోమేశ్వరం, చక్రధారబందం గ్రామాల్లో జరిపిన దాడుల్లో 2 క్రికెట్ లైన్ బాక్స్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, వాయిస్ రికార్డర్, ఒకటీవీ, 2 ట్యాబ్‌లు, సుమారు 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహణకు వాడిన ఖాతాను స్వాధీనం చేసుకుని ఆ ఖాతా నుంచి 7లక్షల 38వేల రూపాయలు నగదు కలిగిన ఖాతాను ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు. క్రికెట్ బుకీల ఫోన్ నెంబర్ల ఆధారంగా దర్యాప్తు చేసి ఈ కేసులో ఇంకా ఎంతమంది ఉన్నారు అనే విషయంపై దర్యాప్తు జరుగుతుందన్నారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న సోమేశ్వరంతో పాటు పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంటుందని డీఎస్పీ తెలిపారు. బెట్టింగ్ స్థావరాలపై దాడులు నిర్వహించేందుకు వ్యవహరించిన మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, మండపేట రూరల్ ఎస్ఐ బుజ్జిబాబు, రాయవరం ఎస్ఐ సురేష్‌బాబు, ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ పి.వీర్రాజు, సత్యనారాయణ మూర్తి, కె.లక్ష్మీనారాయణ, శివ, స్వామి, గన్నియ్య, వంశీ, అప్పన్నకుమార్, వీరేంద్ర, సుధాకర్ కుమారిలను డీఎస్పీ అభినందించారు.

చేబ్రోలులో గుర్తు తెలియని వ్యక్తి హత్య!

గొల్లప్రోలు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డు చెంతనే గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా సోమవారం పోలీసులు కనుగొన్నారు. అతడిని హత్య చేసి ఇక్కడకు తెచ్చి పడవేసినట్టు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి సమీపంలో ఈ సంఘటన జరగడం కలకలం రేపింది. చేబ్రోలు బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్ 216) పోలవం కాలువ సమీపంలో మరణించి ఉన్న ఆ వ్యక్తి వయస్సు సుమారు 40-50 ఏళ్లు ఉంటుంది. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని ఇక్కడే హత్య చేయడం లేదా, మరో ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడవేసి ఉండవచ్చని భావిస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎవరు హత్య చేశారు అనే విషయం విచారణలో తేలుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మృతుడి చేతికి రాగికడియం ఉందని, వివరాలు తెలిసిన వారు పిఠాపురం సీఐ సెల్ 9440796523 లేదా గొల్లప్రోలు ఎస్ఐ సెల్ 9440900758 లేదా పోలీసు కంట్రోల్‌రూమ్ సెల్ 9494933 233కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

హత్యా నేరం రుజువు కావడంతో యువకుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హత్యా నేరం రుజువు కావడంతో ఓ యువకుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గొడవల నేపథ్యంలో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన జీరి వెంకట తోటయ్యను అదే ప్రాంతంలోని దుర్గా నగర్‌కి చెందిన యర్రా సాయి (సాయి కిరణ్, షూటర్‌సాయి, దొంగ సాయి) 2021 సెప్టెంబరు 9 తెల్లవారుజామున చాకుతో విచక్షణా రహితంగా పొడిచాడు. అక్కడే ఉన్న సర్వే కర్ర, రాయితో తలపై బలంగా కొట్టి చంపేశాడు. మృతుడి తల్లి జీరి జయలక్ష్మి ఫిర్యాదుతో అప్పటి సీఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

పోలవరం పీవోను కలిసిన నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్


పోలవరం పీవో అభిషేక్‌ను కలిసిన మార్టిన్‌లూథర్ తదితరులు

ధవళేశ్వరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని, కొందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నేటికీ అందలేదని పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ అన్నారు. ఈ మేరకు ధవళేశ్వరంలోని పోలవరం భూ సేకరణ కార్యాలయంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ ఐఏఎస్ అధికారి అభిషేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నిర్వాసితుల సమస్యలు, పోలవరం ప్రాజెక్టు ఎత్తు గురించి చర్చించారు. నిర్వాసితులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అరుసు మిల్లి రమేష్, పీసీసీ సభ్యుడు చిన్నం మురళీకృష్ణ, తడాల కొండ్రాజు, అగర్వాల్ హీరాలాల్, పట్నాల శ్రీనివాస్, ఎం.భద్రం దొర, బర్రె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గౌతమీ సూపర్‌బజార్ లీజులో 5 కోట్ల అవినీతి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గౌతమీ సూపర్‌బజారు లీజులో రూ.5 కోట్లు అవినీతి చేసింది భరత్‌రామేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతమి సూపర్‌బజార్ స్థలం 11 ఏళ్ల లీజును అక్రమంగా రద్దుచేసి రూ.5 కోట్ల ముడుపులు తీసుకున్న పారాచ్యూట్ లీడర్ మార్గాని భరత్ అని ఈ స్థలాన్ని అక్రమంగా మరో 33 ఏళ్లకు సబ్ లీజుకు ఇచ్చాడని, దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. పేపరుమిల్లు పరంపర కార్మికులు 111 మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని వారి నుంచి లక్షలాది రూపాయలు దండుకుని ప్రవీణ్‌చౌదరితో కలిసి భరత్‌రామ్ పంచుకున్నారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, చాపల రాజు, దుత్తరపు గంగాధర్, బొర్రా చిన్ని, మామిడి శ్రీను, కానేటి ప్రభుదాస్, ఆడారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ధవళేశ్వరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద నెలకొల్పిన అభయ ఆంజనేయ స్వామి 9వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాష్ట్ర టూరిజం బోటు డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మజ్జిపద్మ, టీడీపీ మండలాధ్యక్షులు మచ్చేటిప్రసాద్, ఆళ్ల ఆనందరావు.. స్వామిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బర్రి సుబ్బారావు, కార్యదర్శి ఆళ్ల విఠల్, సభ్యులు.. ఎమ్మెల్యే గోరంట్లకు స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి గజమాలతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో మజ్జిగ, ప్రసాదాల పంపిణీ, అన్న సమారాధన నిర్వహించారు.


కడియంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు

కడియంలో రామాలయ వార్షికోత్సవం

కడియం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పడాల వారివీధిలో సీతారామచంద్రస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సోమవారం జరిగింది. చిక్కాల ఉమామహేశ్వరరావు-రాధామాధవి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆగమ పండితుడు వేదాంతం జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

8న ఆలిండియా ఇన్సూరెన్స్ మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న లక్నో నగరంలో ఆలిండియా ఇన్సూరెన్స్ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్టు రాజమండ్రి డివిజన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రాజమండ్రి డివిజన యూనియన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్ తదితరులతో కలిసి కోదండరామ్ సోమవారం ఆవిష్కరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, అసమానతలు, అత్యాచారాలపై వివరణలు, పరిష్కారాలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల కన్వీనర్ ఆర్.శిరీష, కె.శ్రావణి,శ్రీదేవి, కె.వి జయదుర్గ, శ్రీలత, ప్రమద్వర, ఉమాదేవి, ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యంపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రబడ్జెట్‌లో బీసీలకు రూ47,458 కోట్లు కేటాయించడంపై తూర్పుకాపు ఐక్యత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడి శ్రీను సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తూర్పుకాపులు ఆర్థికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే ఓబీసీ రిజర్వేషన్లు కల్పించడంలో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోసానిని ఉరితీసినా తప్పులేదు


సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

- ఆడబిడ్డల గురించి మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి
- పుష్కరాల నాటికి రూరల్ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం
- ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పోసాని మురళీకృష్ణ ఒక మూర్ఖశిఖామణి అతన్ని ఉరితీసిన తప్పులేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదుట వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు నోరు జారితే జరిగే పరిణామాలు ఆలోచించుకోవాలన్నారు. పోసాని గాని, వంశీ గాని, నాని గాని ఎవ్వరైనా చట్టానికి అతీతులు కాదన్నారు. ఎంత దారుణంగా మాట్లాడారో, ఎన్ని దాడులు చేసారో ప్రజలకు తెలుసునని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు 43వేల కోట్లను తమ ప్రభుత్వం తీర్చిందన్నారు. రాష్ట్రంలో 20వేల కిలోమీటర్ల మేర రోడ్లు బాగు చేశామన్నారు. 6లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు పూర్తి చేశారన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారని, అయితే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తామని, అప్పటికి రూరల్ గ్రామాలను విలీనం చేసి నగరపాలక సంస్థకు కొత్త కార్యవర్గం ఏర్పడుతుందన్నారు. చాలా ఏళ్లుగా గ్రామాలకు పాలక మండళ్లు లేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కోర్టు అడ్డంకులు తొలగింపచేసుకుని విలీనం చేస్తారని చెప్పారు. సమావేశంలో పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ నాయకులు మచ్చేటి శివ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకే లక్ష్యం

అధికారులలో సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్‌కు ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల విభాగాధిపతులు, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకోవడం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్‌కు 2020లో 51వ, 2021లో 41వ, 2022లో 97వ, 2023లో 59వ ర్యాంక్‌లు సాధించామని ఈ ఏడాది మెరుగైన ర్యాంక్ సాధించాలన్నారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన వార్డుల్లో విస్తృతంగా తిరిగి సిటిజెన్ ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించి ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఇంటింటి చెత్తను సెగ్రిగేషన్ చేసి పారిశుధ్య వాహనాలకు అందించాలన్నారు. వ్యాపారస్తులు, తోపుడు బండ్లు వారు తమ చెత్తను డస్ట్‌బిన్‌లలో ఉంచి కార్పొరేషన్ వాహనాలకు అందించాలన్నారు. పాఠశాల, కాలేజీ విద్యార్థులు స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములవ్వాలని కమిషనర్ అన్నారు. ఈ ఏడాది 1,50,000 మంది నుంచి అభిప్రాయాలు సేకరించడం లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మాధవి, విద్యాశాఖ అధికారులు రవితేజ, రజని, ఆరోగ్యశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి ఆశయ సాధనకు కృషి

వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గన్ని కృష్ణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దివంగత లోక్ సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయాలు సాధించకపోవడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో సోమవారం బాలయోగి చిత్రపటానికి నివాళులర్పించారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ బాలయోగి కలలు గన్న కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్, గోదావరి నదిపై కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన నిర్మించాలన్నారు. ఎంతోమంది ఆ నియోజకవర్గ ఎంపీలుగా పనిచేసినా ఆయన ఆశయాలను సాధించలేపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, రాచపల్లి ప్రసాద్, మజ్జి రాంబాబు, రెడ్డి మణి, జవ్వాది మురళీకృష్ణ, తంగేళ్ళ బాబి పాల్గొన్నారు.

కడియం పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

కడియం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ఫెలోషిప్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం కడియంలోని డీఎల్ మోడీ మందిరంలో రత్నదీప్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఫెలోషిప్ నాయకులు ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, కె.జయశీల్‌లు మండల కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా డీఎల్‌మోడీ, ఉపాధ్యక్షుడిగా ఎస్.జీవరత్నం, సెక్రటరీగా సామ్యూల్‌రాజ్, ట్రెజరర్‌గా రత్నదీప్, జాయింట్ సెక్రటరీగా డి.ఏసురత్నం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫెలోషిప్ నాయకులు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వితరణ


హాస్టల్‌కు అందజేసిన పరికరాలతో బ్యాంకు అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజమండ్రి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్, స్టౌ, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు అందజేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వీటిని అందజేసినట్టు బ్యాంక్ రీజనల్ హెడ్ ఏవీ విశ్వేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో సినిమా షూటింగ్

ధవళేశ్వరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో రామ్ హీరోగా, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో నిర్వహిస్తున్న ప్రొడక్షన్ నెంబరు-27 సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. దర్శకుడు పి.మహేష్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజమహేంద్రవరానికి చెందిన సిద్ధార్థ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో ఆలయ సన్నివేశాలను మెట్ల మార్గంలో చిత్రీకరిస్తున్నారు.

రాజమహేంద్రవరంలో సత్యా ఏజెన్సీస్ షోరూం



రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో సత్య షోరూం 52వ బ్రాంచిని సోమవారం ప్రారంభించారు. దీనితో కలిపి తమిళనాడు, ఏపీలో 300కు పైగా షోరూంలు ఉన్నాయని డీజీఎం సురేశ్ చెప్పారు. 1.5టన్ 5స్టార్ ఏసీ కొంటే టీవీ, 1.5టన్ 3 స్టార్ ఏసీ కొంటే టేబుల్ ఫ్యాన్ ఉచితంగా ఇస్తామన్నారు. అన్ని గృహోపకరణాలపై 70శాతం వరకూ తగ్గింపు ఉందన్నారు. ప్రతి కొనుగోలుపై బహుమతి కచ్చితమన్నారు. కార్యక్రమంలో తీగల రాజా, సేల్స్‌హెడ్ సెంథిల్, మార్కెటింగ్ హెడ్ గాంధీ, సత్యా ఏజెన్సీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒంగోలు పీవోడబ్ల్యూ సభను విజయవంతం చేయండి

జిల్లా కార్యదర్శి శ్రీదేవి


రాజానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

రాజానగరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల8న ఒంగోలులో తలపెట్టిన పీవోడబ్ల్యూ విలీన సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి లచ్చల శ్రీదేవి పిలుపునిచ్చారు. విలీన సభకు సంబంధించిన పోస్టర్‌ను రాజానగరంలోని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై నిరంతరం ప్రగతి శీల మహిళా సంఘం పోరాడుతుందన్నారు. మద్యం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా కూరుకుపోయి రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యపాన నిషేధంలో నేటి ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలంతా మద్యం నిషేధం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా రెండుగా చీలిపోయిన పీవోడబ్ల్యూ మహిళా సంఘం ఒకటిగా విలీన కాబోతున్నాయన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తుమ్మల కళావతి, గొర్ల దుర్గ, దొమ్మ సీత, నక్కా లక్ష్మి, తోటకూర బేబి, అరవాలమ్మ, లొల్ల శివ పార్వతి, జగదాంబ పాల్గొన్నారు.

సీతారామచంద్రమూర్తిస్వామికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూజలు



రంగంపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాత వీరంపాలెం గ్రామంలో శ్రీసీతారామచంద్ర మూర్తిస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, పాతవీరంపాలెం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం, మార్చి3(ఆంధ్రజ్యోతి): భూపతిపాలెం గురుకుల పాఠశాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వతరగతిలో ప్రవేశానికి, 6,7,8వ తరగతుల్లో ఖాళీగాఉన్న సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల చైర్మన్ గన్నా రాము సోమవారం తెలిపారు. విద్యార్థులు ఈనెల31వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం 9542350444 సెల్‌ను సంప్రదించాలన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

బిక్కవోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కొంకుదురు గ్రామ శివార్లలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగుర్ని సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేసినట్లు బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలి పారు. వారి నుంచి రూ. 20,490 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

టౌన్ ప్లానింగ్ రూల్స్‌పై అవగాహన కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న రుడా, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగునూరు నారాయణ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవరం జీవో నెంబరు 3,4,5,7,20పై శిక్షణా అవగాహన కార్యక్రమం రుడా చీఫ్ ప్లానింగ్ అధికారి జీవీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగింది. దీనికి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాస మూర్తి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ (ఎఫ్ఏసీ) అండ్ రూడా ఎన్.శ్రీనివాస్, సీటీప్లానర్ కోటయ్య, కుడా ప్లానింగ్ అధికారి వి.శ్రీనివాస్, కాకినాడ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీకృష్ణారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, అసిస్టెంటు డైరెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ అధికారులు, ఉమ్మడిజిల్లా ఎల్‌టిపిలు హాజరయ్యారు. ఈసందర్భంగా టౌన్‌ప్లానింగ్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అనుమతికి మించి అంతస్తులు నిర్మించినా, సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం చేసినా, రోడ్లపై ర్యాంపు కట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈశిక్షణలో జిల్లా లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌కు, బిల్డర్స్‌కు, స్ట్రక్చరల్ ఇంజనీర్స్‌కు అవగాహన కల్పించారు.

జిల్లా స్థాయి విజేతలుగా బొబ్బిల్లంక విద్యార్థులు


జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సీతానగరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బొబ్బిల్లంక జిల్లా పరిషత్ విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌క్విజ్ పోటీల్లో బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థులు వై.నాగమహేష్, పి.రెవల్‌బాబులు జూనియర్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి కంచి వాసుదేవరావు మెరిట్ సర్టిపికెట్లు, బహుమతులు అందజేశారు బొబ్బిల్లంక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించడంతో హెచ్ కోలా సత్యనారాయణ, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

భారీ అన్నసమారాధన



దేవరపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శివ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేసిరాజు రాజ్‌కుమార్, అంబటి శ్రీనివాసరావు, తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 21మంది గైర్హాజరు

గోకవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గోకవరంలో జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 21మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరిగిన పరీక్షలకు 352మందికి 334 మంది హాజరయ్యారు. బీఎస్ఆర్ కళాశాల్లో జరిగిన పరీక్షకు 205మందికి 202మంది విద్యార్థులు హాజరయ్యారు.

16మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్. మాధురి తెలిపారు. తెలుగు పరీక్షకు ఏ సెంటర్‌లో 253 మందికి 240మంది, బీ సెంటర్‌లో 216 మందికి 213మంది హాజరయ్యారని, 16మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎ.పి.ఆర్.వి.ప్రసాద్, ఎం.వి.ఎస్ కృష్ణ డీవోలుగా వ్యవహరించారని వారు తెలిపారు.

శ్రీరామ ఉత్సవ సమితి పోస్టర్ ఆవిష్కరణ


శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి పోస్టర్, కరపత్రం ఆవిష్కరణ దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద పెద ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏటా శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించనున్న బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు ఆధ్యక్షతన ర్యాలీకి సంబంధించి సన్నాహక సమావేశం ఇస్కాన్ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు రామరాజు ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న జరిగే బైక్ ర్యాలీకి పోస్టర్, కరపత్ర ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రభు శివ గోపీనాథ్, సమితి ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, రామదేవ, పుల్లా రాజశేఖర్, యడ్లపల్లి అయ్యప్ప స్వామి, కేఎల్ భవాని, కోశాధికారి తాడోజు సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో నన్నయకు వెండి పతకం


విజేత రామలక్ష్మిని అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో 87కిలోల కేటగిరిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కర్నాటి నాగరామలక్ష్మి వెండిపతకం సాధించింది. ఈసందర్భంగా ఆమెకు వీసీ ఆచార్యప్రసన్నశ్రీ సన్మానించి పతకం, ట్రోఫీ అందజేశారు. హిమాచలప్రదేశ్‌లోని ధర్మశాలలో ఫిబ్రవరి 14 నుంచి 17వరకు ఈచాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో నన్నయ అనుబంధ కళాశాల అయిన భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల విద్యార్థిని నాగరామలక్ష్మి ప్రతిభ కనబరచి వెండి పతకం సాధించిందని వీసీ చెప్పారు. ఏప్రిల్ నెలలో గోవాలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు ఆమె ఎంపికైందన్నారు. గత ఏడాది జరిగిన జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో వెండి, రజిత పతకాలను రామలక్ష్మి సాధించిందన్నారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఆశీర్వదించారు. అలాగే రామలక్ష్మిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, కళాశాల, విశ్వవిద్యాలయం అధ్యాపకులను, కోచ్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, టీం మేనేజర్ ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, కోచ్ ఎం.రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



అనపర్తి జీబీఆర్, సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు

పోలీసు శాఖ ఆధ్వర్యంలో

అనపర్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం అనపర్తిలోని జీబీఆర్ కళాశాలలో విద్యార్థినులకు అనపర్తి పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యార్థినులకు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, పితృస్వామ్య నిబంధనలను సవాల్ చేయడంలో పురుషుల ప్రమేయం అవసరం అనే అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి పెద అబ్బాయిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతా ఆనందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం, (ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం లింగ వివక్షపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో లింగ వివక్షను అరికట్టడంలో పితృస్వామ్య నిబంధనలు సవాలు చేయడంలో పురుషుల ప్రమేయం అవసరం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పురుషుల ప్రమేయం తప్పక ఉండాలని అప్పుడే లింగవివక్ష తగ్గుతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈపోటీల్లో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిట్టిబాబు, సిబ్బంది, ఎస్ఐ రామ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ప్రైవేట్ స్కూల్స్ ఫీజు దోపిడీని అరికట్టండి


డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందిస్తున్న అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, ఫీజు దోపిడీని అరికట్టాలని డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావును కలిశారు. ఈసందర్భంగా మర్యాద పూర్వకంగా మొక్కను అందించారు. అనంతరం విద్యాహక్కుచట్టం, ప్రైవేట్ విద్యాసంస్థల అడ్డగోలు ఫీజులపై చర్చించారు.



రంజాన్ వేళలు | ఇఫ్తార్ (మంగళ) సా.6.18 | సహారి (బుధ) ఉ.4.58

87 ఏళ్లు దాటినా అదే వంతెనపై.. 8
ప్రమాదకరంగా సమిశ్రగూడెం వంతెన

అధ్యక్షా!

అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేలు గళమెత్తారు.. సమస్యల వాణి వినిపించారు.. అభివృద్ధికి అండగా నిలబడాలని కోరారు.. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా ముగ్గురు ఎమ్మెల్యేలు తమ విన్నపాలు అసెంబ్లీలో ఎలుగెత్తారు.. రాజమహేంద్రవరం, కొవ్వూరు ఎమ్మెల్యేలు గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై విన్నవించారు.. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. అనపర్తి ఎమ్మెల్యే డెల్టా ఆధునికీకరణ, కాటన్ బ్యారేజీ అభివృద్ధిపై చర్చించారు.. వెంటనే ఆధునికీకరణ పనులపై దృష్టి సారించాలని కోరారు.

పుష్కరాలకు 15 కోట్ల మంది భక్తులు : వాసు



రాజమహేంద్రవరం సిటీ,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన మహాకుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ స మావేశాల్లో సోమవారం డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు మాట్లాడే అవకాశం ఇవ్వడంతో ఆదిరెడ్డి వాసు గోదావరి పుష్కరాల గురించి మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు ఇంకా రెండేళ్ళ సమయం ఉందన్నారు.రాజమహేంద్రవరం, రూరల్, కొవ్వూ రు,రాజానగరం ఇంకా గోదావరి పరీవాహక ప్రాంత పరిధిలో 12 రోజుల పాటు జరిగే పుష్కరాలకు దేశవ్యాప్తంగా 15 కోట్ల మంది యాత్రి కులు ,భక్త లు, వస్తారని అంచనా ఉందన్నారు.దానికి తగినట్లు ఇప్పటి నుంచే పనులు చేయాలన్నారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించాలన్నారు.

కొవ్వూరులో 25 కి.మీ గోదారి తీరం : ముప్పిడి



కొవ్వూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గోదావరికి 2027లో రానున్న పుష్కరాలకు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కొత్తగా ఘాట్లను అభివృద్ధి చేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కొవ్వూరు నియోజకవర్గం విజ్జేశ్వరం సెంటర్ నుంచి పట్టిసీమ వరకు సుమారు 25 కిలోమీటర్లు గోదావరి తీరాన్ని ఆనుకుని ఉందన్నారు. పుష్కర యాత్రికులను దృష్టిలో పెట్టుకుని ఘాట్లు, దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కొవ్వూరులో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని కోరారు. పశివేదల, దొమ్మే రు, నందమూరు, వేములూరు గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు,ఈనామ్ 22ఏ సమస్యలను పరిష్కరించమని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టాలి : నల్లమిల్లి



అనపర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాటన్ బ్యారేజీ పరిరక్షణకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. అసెంబ్లీలో గోదావరి డెల్టా ఆధునీకరణ ఆవశ్యకతను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు.గోదావరి డెల్టాలో 4216 కిలోమీటర్ల కాలువలు, 3616 కిలో మీటర్ల డ్రెయిన్లు ఉన్నాయని వీటిలో ఒక్క కిలో మీటరు కూడా తూడు తీసిన దాఖలాలు గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో లేవన్నారు. బ్యారేజీ మరమ్మతుల నిమిత్తం డ్రిప్ పథకం కింద మంజూరైన రూ.146 కోట్లతో పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు.లిఫ్ట్ ఇరిగేషన్‌లోని చాగల్నాడు, వెంకటనగర్, పుష్కర ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వీటిని పునరుద్ధరించే ప్రతిపాదనలు ఉన్నాయా అని మంత్రిని కోరారు.

బ్యాలెట్.. బాక్సింగ్!



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఓట్ల లెక్కింపు

ఉదయం నుంచి ఎమ్మెల్సీ ఓట్లతో కుస్తీ

- సుదీర్ఘంగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కట్టలుగా కట్టేందుకే 12 గంటలు
- 700 మంది సిబ్బంది నియామకం
- మూడు షిఫ్టులుగా విధులు
- రాత్రి 8 నుంచి లెక్కింపు ఆరంభం
- 10 గంటలకు తొలిరౌండ్ పూర్తి
- ఫలితానికి మరింత సమయం
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

(ఏలూరు - ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది. ఫిబ్రవరి 27న జరిగిన పోలింగ్‌లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి 17 రౌండ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ సోమవారం ఉదయం ఆరంభమై రాత్రి పొద్దు పోయేంత వరకు నిరవధికంగా కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. సాధ్యమైనంత మేర కౌంటింగ్ ప్రక్రియలో జాప్యం నివారించేందుకు ప్రయత్నిస్తున్నా పొద్దుపోయేంత వరకు బ్యాలెట్ పత్రాలు బండిల్స్‌గా కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. 17 రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో 17 రౌండ్ల మేర కొనసాగించేందుకు ఏర్పాట్లుచేసి మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు.

లెక్కింపు..ఈజీ కాదు..

సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండా పోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లుగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపుకార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.



లెక్కింపు కేంద్రం వద్ద కూటమి అభ్యర్థి పేరాబత్తుల

బండిల్స్‌గా కట్టేందుకే ఒకరోజు..

సాధారణ ఎన్నికలకు భిన్నంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగించారు. ఈకారణంగా బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రంలోకి రప్పించడం, వాటి నుంచి బ్యాలెట్ పత్రాలను వెలికి తీసి బండిళ్లుగా కట్టడానికి చాలా సమయం తీసుకుంది. రౌండ్‌ల వారీగా పదివేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి అతి తక్కువ టేబుళ్లను వేసి కౌంటింగ్‌కు దిగారు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లుగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురు చూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో తొలి ప్రక్రియ మాత్రమే రాత్రి వరకు కొనసాగుతూ వచ్చింది. రాత్రి ఎనిమిది గంటల సమయానికి బండిళ్లుగా కట్టడం పూర్తయ్యింది. ఈ మొత్తం ప్రక్రియకు మొత్తం 12 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ఆరంభించారు. ప్రచారంలో నువ్వానేనా అన్నట్టుగా సాగిన వ్యవహారం ఓట్ల లెక్కింపు లోను అదే ఉత్కంఠ కొనసాగుతోంది.

తొలి రౌండ్ పేరాబత్తులదే..

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు టెన్షన్.. టెన్షన్‌గా సాగుతుంది. ఎనిమిది రౌండ్‌లుగా ఒక్కో రౌండ్‌కి 28 వేలు చొప్పున లెక్కించేందుకు రంగంలోకి దిగారు. ఒక్కో రౌండ్‌లోను చెల్లినవి, చెల్లని ఓట్లు విడివిడిగా విభజిస్తారు. సోమవారం రాత్రి 8 గంటలకు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ తొలి రౌండ్ ఫలితం రాత్రి పదిన్నరకు వెల్లడైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 16,520 ఓట్లు, సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుకు 5,815 వేల ఓట్లు, ఇతరులకు 3249 లభించాయి. 2416 చెల్లని ఓట్లు ఉన్నాయి.ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి మంగళవారం రాత్రి పొద్దుపోవచ్చని అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఏలూరు క్రైం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువజామునే కౌంటింగ్ విధులకు నియమించబడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేశారు.సెల్‌ఫోన్‌లు బయట కౌంటర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్.కిశోర్



అధికారుల పరిశీలన

గోదావరిలో ఘోర ప్రమాదం



పుష్కరఘాట్‌లో మృతుడి కుటుంబీకులు

గోదావరిలో ఘోర ప్రమాదం జరిగింది.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ నుంచి గోదావరి లంకల్లోకి 23 మందితో బయలు దేరిన నాటు పడవ పాత రైలు వంతెన 8వ పిల్లర్ వద్ద సోమవారం రాత్రి 7:30 గంటలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు గల్లంతయ్యారు.. మిగిలిన వారు స్తంభాలను పట్టుకుని ఉండడంతో కాపాడారు. గాలింపు చర్యలు చేపడుతున్నారు. - మెయిన్‌లో

ప్రభుత్వ బోధనాసుపత్రిలో విధులపై రచ్చ రచ్చ

- ఒక్క ఎంఎన్‌వోకు ఎనిమిది వార్డుల్లో విధులా ..?
- మరో ఎంఎన్‌వోతో మందుల పెట్టెలు మోయిస్తారా ?
- ఆర్ఎంవో ఎదుటే ఎంఎన్‌వోలు, జీడీఏలు పంచాయితీ
- ఆర్ఎంవోకు అసోసియేషన్ నాయకుల ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఎంఎన్‌వోలు, జీడీఏలకు డ్యూటీల వ్యవహారం రచ్చ రచ్చగా మారింది. డ్యూటీలు వేసే సూపర్‌వైజర్ అస్మదీయులకు ఒకలా, తస్మదీయులకు మరోలా డ్యూటీలు వేస్తుండడంతో ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఆసుపత్రి ఆర్ఎంవో ప్రణవ్‌కు ఫిర్యాదు చేసేంత వరకూ వెళ్లింది. కనీస అవగాహన లేకుండా ఒక ఎంఎన్‌వోకు 8 వార్డుల్లో డ్యూటీ వేయడం, మరో ఎంఎన్‌వోతో మందుల పెట్టెలు మోయించడం తదితర సమస్యలపై కొందరు ఎంఎన్‌వోలు భగ్గుమని మండిపడుతూ జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులకు ఫిర్యాదు చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం దీనిపై ఆర్ఎంవో గదిలో ఆయన ఎదుటే ఎంఎన్‌వోలు, జీడీఏలు, అసోసియేషన్ నాయకులతో పెద్ద పంచాయతీ నడిచింది. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సూపర్‌వైజర్‌గా కొనసాగుతున్న సీనియర్ ఎంఎన్‌వో రోస్టర్‌ను పాటించకుండా స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా డ్యూటీలు వేస్తున్నారని, దీనివల్ల చాలా మంది ఎంఎన్‌వోలు డ్యూటీలు చేయలేక నలిగిపోతున్నారని పేర్కొన్నారు. డ్రగ్ స్టోర్‌లో పనిచేస్తున్న పలువురు ఎంఎన్‌వోలు, జీడీఏలను మందుల పెట్టెలు మోసేందుకు వినియోగించడం సరికాదని, ఒక హెచ్‌వోడీ దగ్గర ఇద్దరు జీడీఏలు ఎంఎన్‌వోలుగా సుమారు రెండేళ్ల నుంచి కొనసాగుతున్నారన్నారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన పీఆర్‌వోలు ఆసుపత్రిలోకి అనధికారికంగా ప్రవేశించి కేసులు తరలించుకుపోతున్నారని వెల్లడించారు. డ్యూటీలు వేసే సూపర్‌వైజర్‌పై గతంలో అనేక ఆరోపణలు రావడంతో అధికారులు కొద్ది రోజులు పక్కకు తప్పించి మళ్లీ ఆయన్నే సూపర్‌వైజర్ చేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎన్‌వోలు, జీడీఏల డ్యూటీల రోస్టర్ అవకతవకలపైనా,అనధికార వ్యక్తుల ప్రవేశంపైనా ఆసుపత్రి ఉన్నతాధికారులు విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవోను కోరామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. దీనిపై ఏం చర్యలు చేపడతారో చూడాల్సిందే.

సీనియర్ ఇంటర్ పరీక్షలకు 283 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2025లో భాగంగా సోమవారం నుంచి రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు ఆరంభమయ్యాయి.మొదటి రోజున జనరల్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం నిర్వహించగా 18,005 మందికి 17,777.. ఒకేషనల్ విభాగంలో 1689కి 1634 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

కేశవరం, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో ఆర్‌వోబీల నిర్మాణం

కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనపర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డులో మండపేట మండలం కేశవరం, అనపర్తి మండల లక్ష్మీనరసాపురం గ్రామాల వద్ద రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కేశవరం,లక్ష్మీనరసాపురం గ్రామాల వద్ద ప్రజలు ఇబ్బందులకు ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ నిర్వహించడంతో బాటు పనులు చేపడతామన్నారు.



- పెరిగిన ధరలు..
- జీవన వ్యయంపై ప్రభావం
- పెరిగిన మహిళా అక్షరాస్యత
- సగటు జనసాంద్రత 304
- ప్రాజెక్టుల పురోగతిపై లెక్కలు
- సోషియో ఎకనామిక్ సర్వే
- ఇదీ తూర్పు లెక్క

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం సోమవారం సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో 465 పేజీల నివేదిక వెల్లడించింది. ఇందులో రాష్ట్రం ఏయే రంగాల్లో ప్రగతి దిశగా కదులుతోంది.. ఆయా రంగాల్లో ప్రగతి ఎలా ఉంది.. జిల్లాల వారీగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక, ప్రజల ఆర్థిక స్థితిగతులు వంటి అనేక కీలక అంశాలకు సంబంధించి నివేదిక విడుదల చేసింది. ఇందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాల వారీగా ఆయా సామాజిక, ఆర్థిక స్థితిగతులను గణాంకాల రూపంలో విశ్లేషించింది.తూర్పుగోదావరి జిల్లాలో జీవన ప్రమాణాలు పెరుగుతున్నట్టు స్పష్టం చేసింది.

పెరిగిన తలసరి ఆదాయం..

దేశంలో రాష్ట్రం 8వ పెద్ద రాష్ట్రంగా ఏపీ ఉండగా..చదరపు కిలో మీటరుకు జనసాంద్రత సగటున 304గా ఉంది.తూర్పుగోదావరి జిల్లాలో కూడా జనసాంద్ర ఎక్కువే. ఈ సర్వేలో 1981 నుంచి అక్షరాస్యత పెరిగినట్టు స్పష్టం చేసింది. జిల్లాలో ఆక్వా, చేపల పరిశ్రమ, సేవల రంగం పెరుగుతోంది.తలసరి ఆదాయం రూ.2,68,653గా ఉంది.ధరల పెరుగుదల కారణంగా జీవన వ్యయంపై ప్రభావం పడుతున్నట్టు స్పష్టం చేసింది.పరిశ్రమల్లో కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ) ప్రకారం పురుషుల వేతనాల కంటే మహిళల వేతనాలు తక్కువగా ఉన్నట్టు తెలిపింది.

సాగునీటి ప్రాజెక్టులు..

జిల్లాలో పోలవరం ప్రాజెక్టు పనులు 74.92 శాతం పూర్తయ్యాయని అందులో ఎడమ ప్రధాన కాలువ పనులు 73 శాతం, కుడి ప్రధాన కాలువ పనులు 74.92 శాతం పూర్త యినట్టు స్పష్టం చేశారు.ప్రాజెక్టు 78 శాతం పూర్తయినట్టు నివేదిక ఇచ్చారు. పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రస్తావన ఉంది. అగ్రో క్లైమేటింగ్ జోన్ పరిధిలో గోదావరి జోన్ పేరిట తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నట్టు తెలిపింది. అతి ఎత్తయిన ట్రబర్ ఉండే జోన్‌గా తూర్పు నుంచి శ్రీకా కుళం వరకూ పరిగణిస్తున్నారు.

పాడి.. పంటలు..

జిల్లాలో ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ)ని అమలు చేస్తున్నట్టు తెలిపింది. ఈ ప్రాజెక్టు 2017 నుంచి అమల్లో ఉంది. ఐసీడీపీ పథకం కింద జిల్లాలో రూ.198.45 కోట్లతో 13 గొడౌన్ కమ్ ఆఫీస్ భవనాలు నిర్మించారు. సొసైటీలకు వీటిని వినియోగిస్తున్నారు. జీడి మామిడి తోటలకు ప్రాధాన్యత ఉన్న జిల్లాగా గుర్తించారు. ఇక్కడి పాత చెట్లు తీసేసి బాగా కాపు కాసే చెట్లను పెంచనున్నట్టు స్పష్టం చేసింది. సిల్క్ ఫ్యాబ్రిక్ క్లస్టర్‌గా జిల్లా ఉన్నట్టు పేర్కొంది.ఈ రంగంలో చిన్న తరహా పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నట్టు స్పష్టం చేసింది. జిల్లా ఎక్స్‌పోర్ట్ హబ్‌గా ఉందని, ఇక్కడ క్వాయర్, కాయర్ ఉత్పత్తులు, జీడి మామిడి,నర్సరీలు ఉన్నాయని తెలిపింది. వివిధ పంటలు, పాలు మాంసం ఉత్పత్తి గణాంకాలు ఇచ్చింది.పాలు 351.968 లీటర్లు, 77.319 టన్నుల మాంసం, గుడ్లు 58047.314 టన్నులు ఉత్పత్తి అయినట్టు లెక్క కట్టింది. జిల్లాలో 20 పశుగణన ప్రకారం 74,778 పాలు, మాంసం కోసం పెంచే జంతువులు ఉండగా, గేదెలు 1,93,847, గొర్రెలు 1,71,263, మేకలు 69,265, పందులు 2080, కోళ్లు 2,13,75,656 ఉన్నట్టు తేల్చింది. ఇన్ ల్యాం డ్ఫిష్, ఫ్రెష్ వాటర్ రొయ్యలు 93,199 ఉన్నా యి. ఇలా సర్వే తెలియజేసింది.

నిధులు..నిక్షేపాలు..

కేజీ బేసిన్‌లో సహజవాయువు అన్వేషణ, ఉత్పత్తి గురించి ప్రస్తావించింది.జిల్లా గ్రానైట్‌కు గుర్తింపు ఉందని తెలిపింది. తూర్పు నుంచి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వరకూ రోడ్ల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేసింది. ఇక్కడ 30 రోడ్లు, 16 బ్రిడ్జిలతో మొత్తం 46 పనులు చేస్తుండగా ఇప్పటికే 27 రోడ్లు, 14 బ్రిడ్జిలు పూర్తయినట్టు స్పష్టం చేసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ అండ్ మిసిలీనియస్ పనులు జరుగుతున్నాయి.ఇప్పటికి 30 శాతం పూర్తికాగా ఆగస్టు 11వ తేదీకి మొత్తం పనులు పూర్తవుతాయని తెలిపింది. టూరిజం హబ్‌గా అభివృద్ధి జరగనుందని..జిల్లాలో బోటింగ్ ఫ్లీట్‌కు అనుకూల పరిస్థితి ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపింది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింది హేవలాక్ బ్రిడ్జిని టూరిస్టులు ఆకర్షించే విధంగా రూ.94.44 కోట్లతో అభివృద్ధి చేస్తారని సర్వే స్పష్టం చేసింది. ఇక ఆర్థిక అసమానతల విషయంలో హెడ్‌కౌంట్ యూనిట్ శాతం 6.13 ఉంది. ఇంటర్‌సిటీ 43.65 శాతం, ఎంపీఐ స్కోర్ 0.027గా ఉంది. జిల్లాలో ఈ ఏడాది వర్షపాతం 12.2 శాతం అధికంగా నమోదు కావడం గమనార్హం. జిల్లాలో దీపం, వివిధ రకాల పథకాల కింద ఎంత మంది లబ్ధిపొందుతున్నారో కూడా స్పష్టం చేసింది.



ప్రపంచ వినికిడి దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

వినికిడి సమస్యను నిర్లక్ష్యం చేయవద్దు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వినికిడి సమస్యలు తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. వయసు రీత్యా వినికిడి లోపం వచ్చిన వారికి ఎన్జీవో సంస్థలు, ప్రభుత్వ పథకాల్లో భాగంగా వినికిడి యంత్రాలు అవసరమైన వారికి అందేలా చూసుకోవాలని తెలిపారు. వినికిడి సమస్యతో చాలా మంది నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పుట్టుక నుంచే వినికిడి పరీక్షలు నిర్వహించి ఏమైనా సమస్యలుంటే సత్వర చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు జిల్లా ఎపిడిమాలజిస్ట్ సుధీర్‌బాబు, డిప్యూటీ డెమో సత్యకుమార్, డాక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు


కొవ్వూరు గర్ల్స్ హైస్కూల్లో పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

కొవ్వూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీ వరకు మహిళా సాధికారిత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు సీఐ పి.విశ్వం అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మహిళలపై వివక్షలో పురుషుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మహిళలు, విద్యార్థినుల భద్రత, పోలీసుల విధులు, మహిళా చట్టాలపై పట్ల అవగాహన కల్పించినట్టు సీఐ పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 8న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక భాష్యం స్కూల్లో విద్యార్థులకు లింగసమానత్వం ప్రోత్సహించడంలో పురుషుల ఆవశ్యకత, పితృస్వామ్య వ్యవస్థలో ఎదురయ్యే సవాళ్లు అనే అంశం పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్టు ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగభూషణం, హెడ్‌కానిస్టేబుల్ విజయశ్రీ, స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో లింగసమానత్వంపై వివరిస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం

భారీ అన్నసమారాధన



దేవరపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేసిరాజు రాజ్‌కుమార్, అంబటి శ్రీనివాసరావు, తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

ఉంద్రాజవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వేసవికి గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వీఎస్ రామారావు చెప్పారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుడూ రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులు వద్ద బోర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, మోటార్లు సక్రమంగా పనిచేసేలా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని మాట్లాడుతూ వేసవిలో చెరువులను కాలువల నీటితో నింపుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దేవరపల్లిలో శివానందలహరి పారాయణం


శివానంద లహరి పారాయణ చేస్తున్న మహిళలు

దేవరపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో సోమవారం శివానంద లహరి పారాయణం నిర్వహించారు. తాడేపల్లిగూడేనికి చెందిన రాధాకుమారి శివానందలహరి పారాయణం 100శ్లోకాల్లో 60శ్లోకాలను నేర్పించినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ, ఆలిండియా విష్ణు సహస్ర నామ ఫెడరేషన్ డైరెక్టర్ బలుసు సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

కాపు జేఏసీ రాష్ట్ర నాయకుడు గురునాథం


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తాళ్లపూడి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి వద్ద గోదావరిలో ఐదుగురు యువకులు మునిగి చనిపోయిన సంఘటన జరిగి ఆరురోజులు గడిచినప్పటికీ బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం ప్రకటించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు జెట్టి గురునాథం, తోట రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలకు రూ25 లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో కాపు నాయకులు సోమవారం తాడిపూడి విచ్చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.30 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ నామా శ్రీనివాస్, ప్రకాశం, పోసిన శ్రీకృష్ణదేవరాయలు, వనిమిరెడ్డి శ్రీనివాసు, వితం శ్రీను,కరిబండి త్రినాథస్వామి పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

పోలవరం పీవోను కలిసిన నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్


పోలవరం పీవో అభిషేక్‌ను కలిసిన మార్టిన్‌లూథర్ తదితరులు

ధవళేశ్వరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని, కొందరికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ నేటికీ అందలేదని పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ అన్నారు. ఈ మేరకు ధవళేశ్వరంలోని పోలవరం భూ సేకరణ కార్యాలయంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ ఐఏఎస్ అధికారి అభిషేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నిర్వాసితుల సమస్యలు, పోలవరం ప్రాజెక్టు ఎత్తు గురించి చర్చించారు. నిర్వాసితులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అరుసుమిల్లి రమేష్, పీసీసీ సభ్యుడు చిన్నం మురళీకృష్ణ, తడాల కొండ్రాజు, అగర్వాల్ హీరాలాల్, పట్నాల శ్రీనివాస్, ఎం.భద్రం దొర, బర్రె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ రూల్స్‌పై అవగాహన అవసరం

శిక్షణ కార్యక్రమంలో రుడా, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగునూరు నారాయణ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం జీవో నెంబరు 3,4,5.7, 20పై శిక్షణ, అవగాహన కార్యక్రమం రుడా చీఫ్ ప్లానింగ్ అధికారి జీవీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగింది. దీనికి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాస మూర్తి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ (ఎఫ్ఏసీ) అండ్ రుడా ఎస్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ కోటయ్య, కుడా ప్లానింగ్ అధికారి వి.శ్రీనివాస్, కాకినాడ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీకృష్ణారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, అసిస్టెంటు డైరెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్లు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ అధికారులు, ఉమ్మడి జిల్లా ఎల్‌టీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. అనుమతికి మించి అంతస్తులు నిర్మించినా, సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం చేసినా, రోడ్లపై ర్యాంపు కట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో జిల్లా లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌కు, బిల్డర్స్‌కు, స్ట్రక్చరల్ ఇంజనీర్స్‌కు అవగాహన కల్పించారు.

నిషేధం ఉన్నా.. పట్టించుకోరు

సమిశ్రగూడెం గడ్డర్ బ్రిడ్జిపై యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు

- మరమ్మతులకు గురవుతున్న పురాతన వంతెన
- తరచూ ట్రాఫిక్ జామ్.. ప్రమాదాలు
- రక్షణ చర్యలు తీసుకోవాలంటూ వాహనదారుల గగ్గోలు


సమిశ్రగూడెం బ్రిడ్జిపై నిలిచిపోయిన ట్రాఫిక్



సోమవారం బ్రిడ్జి నుంచి పడిపోయిన సైక్లిస్టు, బయటకు తీస్తున్న వాహనదారులు

నిడదవోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నిత్యం పెద్ద సంఖ్యలో గోదావరి జిల్లాల వాహనాలు రాకపోకలు సాగించే బ్రిడ్జిపై సమస్యలతో వాహనదార్లు నానా అవస్థలు పడుతున్నారు. ఈ పురాతన బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిషేధం ఉన్నా యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి. మరోపక్క బ్రిడ్జి మరమ్మతులకు గురవుతున్నా దాని పరిరక్షణకు ఏ అధికారి చర్యలు తీసుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. బ్రిటీషర్ల హయాంలో నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో గోదావరి కాలువపై బ్రిటీష్ సైన్యం రాకపోకల కోసం ఐరన్ గడ్డర్ బ్రిడ్జిని సుమారు 87 ఏళ్ల క్రితం నిర్మించారు. అది నేటికీ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల వాహనదారుల కు సేవలందిస్తూనే ఉంది. ఆర్ అండ్‌బీ అధికారు లు ఈ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించినా రాత్రింబవళ్లు తిరుగుతూనే ఉన్నాయి. దీని కారణంగా బ్రిడ్జి మరమ్మతులకు గురై ఒక పక్క రెయిలింగ్ సైతం దెబ్బతిన్నది. బ్రిడ్జిపై ట్రాఫిక్‌ను పర్యవేక్షించవలసిన పోలీసులు పట్టించుకోకపోవడంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోవడం సర్వసాధారణం అయిపోయింది. సోమవారం బ్రిడ్జిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో బ్రిడ్జిపై పక్క నుంచి వెళుతున్న సైకిలిస్ట్ రెయిలింగ్ సరిగా లేకపోవడంతో గోదావరి కాలువ గట్టుపై జారి పడ్డాడు. స్థానిక వాహనదారులు స్పందించి అతడిని సురక్షితంగా బయటకు తీశారు. ఈ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నియంత్రించి, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా చర్యలు తీసుకుని వంతెనను పరిరక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

పోసానిని ఉరితీసినా తప్పులేదు

- ఆడబిడ్డల గురించి మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి
- పుష్కరాల నాటికి రూరల్ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పోసాని మురళీకృష్ణ ఒక మూర్ఖశిఖామణి అతన్ని ఉరితీసిన తప్పులేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదుట వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు నోరు జారితే జరిగే పరిణామాలు ఆలోచించుకోవాలన్నారు. పోసాని గాని, వంశీ గాని, నాని గాని ఎవ్వరైనా చట్టానికి అతీతులు కాదన్నారు. ఎంత దారుణంగా మాట్లాడారో, ఎన్ని దాడులు చేసారో ప్రజలకు తెలుసునని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు 43వేల కోట్లను తమ ప్రభుత్వం తీర్చిందన్నారు. రాష్ట్రంలో 20వేల కిలోమీటర్ల మేర రోడ్లు బాగు చేశామన్నారు. 6లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు పూర్తి చేశారన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారని, అయితే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తామని, అప్పటికి రూరల్ గ్రామాలను విలీనం చేసి నగరపాలక సంస్థకు కొత్త కార్యవర్గం ఏర్పడుతుందన్నారు. చాలా ఏళ్లుగా గ్రామాలకు పాలక మండళ్లు లేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కోర్టు అడ్డంకులు తొలగింపచేసుకుని విలీనం చేస్తారని చెప్పారు. సమావేశంలో పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ నాయకులు మచ్చేటి శివ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

13 మంది విద్యార్థుల గైర్హాజరు

- ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం
- మొదటి రోజు ప్రశాంతం


వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో వద్ద విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన సోమవారం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. కొవ్వూరు పట్టణ, మండలంలో 467 మంది విద్యార్థులకు గాను 454 మంది హాజరయ్యారు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 251 మంది విద్యార్థులకు గాను 243 మందికి హాజరవ్వగా 8 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 142 మందికి గాను 137 మంది హాజరవ్వగా 5 మంది గైర్హాజరయ్యారు. మండలంలోని కుమారదేవం రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు 74 మంది విద్యార్థులకు గాను 74 మంది హాజరయినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

తాళ్లపూడిలో 11 మంది గైర్హాజరు

తాళ్లపూడి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 207 మంది రాయనున్నారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గౌరీనాథ్ తెలిపారు. మొదటి రోజు రెగ్యులర్ విద్యార్థులు 152 మందికి గాను 145 మంది, ప్రైవేటు విద్యార్థులు 53 మందికి గాను 49 మంది హాజరయ్యారని, మొత్తం 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

గోపాలపురంలో ఐదుగురు గైర్హాజరు

గోపాలపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో జరిగిన పరీక్షలకు 318 మందికి గాను 315 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. శ్రీగౌతమి జూనియర్ కాలేజీలో జరిగిన పరీక్షకు 233మంది విద్యార్థులకు గాను 231మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకే లక్ష్యం

అధికారులలో సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్‌కు ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల విభాగాధిపతులు, జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకోవడం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్‌కు 2020లో 51వ, 2021లో 41వ, 2022లో 97వ, 2023లో 59వ ర్యాంక్‌లు సాధించామని ఈ ఏడాది మెరుగైన ర్యాంక్ సాధించాలన్నారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన వార్డుల్లో విస్తృతంగా తిరిగి సిటిజెన్ ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించి ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఇంటింటి చెత్తను సెగ్రిగేషన్ చేసి పారిశుధ్య వాహనాలకు అందించాలన్నారు. వ్యాపారస్తులు, తోపుడు బండ్ల వారు తమ చెత్తను డస్ట్‌బిన్‌లలో ఉంచి కార్పొరేషన్ వాహనాలకు అందించాలన్నారు. పాఠశాల, కాలేజీ విద్యార్థులు స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములవ్వాలని కమిషనర్ అన్నారు. ఈ ఏడాది 1,50,000 మంది నుంచి అభిప్రాయాలు సేకరించడం లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మాధవి, విద్యాశాఖ అధికారులు రవితేజ, రజని, ఆరోగ్యశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సభను విజయవంతం చేయండి

పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి శ్రీదేవి


రాజానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

రాజానగరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న ఒంగోలులో తలపెట్టిన పీవోడబ్ల్యూ విలీన సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి లచ్చల శ్రీదేవి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రాజానగరంలోని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పీవోడబ్ల్యూ నిరంతరం పోరాడుతోందన్నారు. మద్యం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యపాన నిషేధంలో నేటి ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలంతా మద్యం నిషేధం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా రెండుగా చీలిపోయిన పీవోడబ్ల్యూ మహిళా సంఘం ఒకటిగా విలీనం కాబోతున్నాయన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తుమ్మల కళావతి, గొర్స దుర్గ, దొమ్మ సీత,నక్కా లక్ష్మి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యంపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రబడ్జెట్‌లో బీసీలకు రూ47,458 కోట్లు కేటాయించడంపై తూర్పుకాపు ఐక్యత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడి శ్రీను సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తూర్పుకాపులు ఆర్థికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే ఓబీసీ రిజర్వేషన్లు కల్పించడంలో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యూనియన్ బ్యాంక్ వితరణ


హాస్టల్‌కు అందజేసిన పరికరాలతో బ్యాంకు అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజమండ్రి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్, స్టౌ, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు అందజేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వీటిని అందజేసినట్టు బ్యాంక్ రీజనల్ హెడ్ ఏవీ విశ్వేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో సినిమా షూటింగ్



ధవళేశ్వరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో రామ్ హీరోగా, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో నిర్వహిస్తున్న ప్రొడక్షన్ నెంబరు-27 సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. దర్శకుడు పి.మహేష్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజమహేంద్రవరానికి చెందిన సిద్ధార్థ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో ఆలయ సన్నివేశాలను మెట్ల మార్గంలో చిత్రీకరిస్తున్నారు.

రాజమహేంద్రవరంలో సత్యా ఏజెన్సీస్ షోరూం



రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో సత్య షోరూం 52వ బ్రాంచిని సోమవారం ప్రారంభించారు. దీనితో కలిపి తమిళనాడు, ఏపీలో 300కు పైగా షోరూంలు ఉన్నాయని డీజీఎం సురేశ్ చెప్పారు. 1.5టన్ 5స్టార్ ఏసీ కొంటే టీవీ, 1.5టన్ 3 స్టార్ ఏసీ కొంటే టేబుల్ ఫ్యాన్ ఉచితంగా ఇస్తామన్నారు. అన్ని గృహోపకరణాలపై 70శాతం వరకూ తగ్గింపు ఉందన్నారు. ప్రతి కొనుగోలుపై బహుమతి కచ్చితమన్నారు. కార్యక్రమంలో తీగల రాజా, సేల్స్‌హెడ్ సెంథిల్, మార్కెటింగ్ హెడ్ గాంధీ, సత్యా ఏజెన్సీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కడియం పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



కడియం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ఫెలోషిప్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం కడియంలోని డీఎల్ మోడీ మందిరంలో రత్నదీప్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఫెలోషిప్ నాయకులు ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, కె.జయశీల్‌లు మండల కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా డీఎల్ మోడీ, ఉపాధ్యక్షుడిగా ఎస్.జీవరత్నం, సెక్రటరీగా సామ్యూల్‌రాజ్, ట్రెజరర్‌గా రత్నదీప్, జాయింట్ సెక్రటరీగా డి.ఏసురత్నం ఎన్నికయ్యారు.కార్యక్రమంలో ఫెలోషిప్ నాయకుడు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

కొవ్వూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీకి చెందిన ఇల్లా వీరమణికి, వీరబాబుతో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా వీరబాబు చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం తీసుకురమ్మని తనను వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ చెప్పారు.

బాలయోగి ఆశయ సాధనకు కృషి చేద్దాం

వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గన్ని కృష్ణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దివంగత లోక్ సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషి చేద్దామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో సోమవారం బాలయోగి చిత్రపటానికి నివాళులర్పించారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ బాలయోగి కలలు గన్న కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్, గోదావరి నదిపై కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన నిర్మించాలన్నారు. ఎంతోమంది ఆ నియోజకవర్గ ఎంపీలుగా పనిచేసినా ఆయన ఆశయాలను సాధించలేపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, రాచపల్లి ప్రసాద్, మజ్జి రాంబాబు, రెడ్డి మణి, జవ్వాది మురళీకృష్ణ, తంగేళ్ళ బాబి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ వార్షికోత్సవం

కడియం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పడాల వారివీధిలో సీతారామచంద్రస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సోమవారం జరిగింది. చిక్కాల ఉమామహేశ్వరరావు-రాధామాధవి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆగమ పండితుడు వేదాంతం జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు.